# దొంగోడొచ్చిండు

రైలు దిగి బస్సెక్కాడు రామానుజం. బస్సులో కూచున్న అతని కెంతో ఆనందంగా ఉంది. మనసు పురి విప్పిన నెమలిలా సంతోషంతో నాట్యం చేస్తోంది. అతనికీ ప్రయాణం ఎడారిలో ఒయాసిస్సులా ఉంది. నాలుకెండిపోతున్న బాటసారికి చల్లటి నీళ్ళు లభించినట్లుగా ఉంది.

"పల్లెటూళ్ళు మన భాగ్య సీమలురా..." తనలో తానే పాడుకున్నాడు. "పల్లెకు పోదాం ... పారును చూద్దాం... అల్లరి చేద్దాం... చలో చలో..." పల్లెకెళుతూ ఆనందపరవశు డవుతూ పార్వతిని చూడటానికి దేవదాసులు ఎంత తహతహలాడాడో, పల్లెను చూడటాని కంతకంటెక్కువ తహతహలాడుతున్నాడు రామానుజం.

రామానుజం పుట్టి పెరిగింది పల్లెటూరే అయినా అతనికి యుక్త వయసు వచ్చేటప్పటికి నా అనే వాళ్లెవరూ మిగలలేదు. ఆస్తిపాస్తులు కూడా ఏమీ లేవు. డిగ్రీ కాగితాలు చేతబట్టుకొని పట్నం వెళ్ళాడు. అక్కడే ఉద్యోగం సంపాదించుకున్నాడు. స్వతహాగా తెలివిగలవాడవడంతో పాటు మామగారి అండదండలవల్ల అంచెలంచెలుగా పైకొచ్చాడు. ఊరొదిలిన ఇరవై ఏళ్ళలోనూ మళ్ళీ ఊరి ముఖం చూల్లేదు. అతని చిననాటి మిత్రులు ఒకరిద్దరు అతన్ని పట్నంలో కలుసుకొన్నా, అతని కెప్పుడూ ఊరెళ్ళే అవసరం కలుగలేదు. అతన్ని రమ్మని పిలిచిన వాళ్ళూ లేరు. ఇన్నేళ్ళుగా ఉద్యోగరీత్యా బొంబాయి, మద్రాస్, ఢిల్లీ, హైదరాబాద్‌లాంటి మహానగరాల్లో గడిపాడు. పెద్ద బంగ్లా, అందమైన భార్య, ఇద్దరు పిల్లలు, మంచి ఉద్యోగం, సుఖ బోగాలు ఎన్నున్నా అతని కెందుకో సంతృప్తిగా లేదు. ఇరవై ఏళ్ళ పట్టణ జీవితానికి మొహం మొత్తింది. అతడేదో వెలితి ఫీలవుతున్నాడు. పట్టణంలోని కృత్రిమత్వంతో అతడు విసిగిపోయాడు. పెదవులపై మాటలు విని విసుగు చెందాడు. మాటల వెనుకున్న లాభాపేక్ష దృష్టిని చూసి కలత జెందాడు. పట్టణంలోని యాంత్రిక జీవితం, యంత్రాల రొద, వాహనాల రణగొణ ధ్వనిలో అలసిపోయాడు. నాగరికత ముసుగులో జరిగే వెకిలి పనులు చూసి అసహ్యించుకున్నాడు.

రామానుజానికి తాను చిన్నతనంలో పల్లెలో అనుభవించిన ఆప్యాయతను పొందాలనుంది. కల్లాకపటం తెలియనివారి కలుపుగోలుతనం చవి చూడాలనుంది. వారి అనురాగాన్ని అనుభవించాలనుంది. చిన్ననాటి స్నేహితులను కలుసుకోవాలనీ, మనసు విప్పి మాట్లాడాలనీ ఉంది. ఇడ్లీ, వడ, దోసెలతో మొహం మొత్తిన రామానుజానికి పచ్చి కంకులు, పచ్చి పల్లీలు, పచ్చి అటుకుల్లాంటివి తినాలనుంది. తాను చిన్నప్పుడు తిరిగిన ప్రదేశాలను చూడాలని ఉబలాటంగా ఉంది. డబ్బు

దానిమీద మోజు మనుష్యులమధ్య దూరాన్ని పెంచిన రామానుజానికి ఈ ప్రయాణ మెంతో హాయి నిస్తోంది.

బస్సు వేగంగా పరుగిడుతోంది.

రామానుజంలో ఎన్నో ఆలోచనలు...

తాను ఎవరికీ తెలియజేయకుండా ఊరెళుతున్నాడు. తన రాక జూచి పాత మిత్రులు ఆశ్చర్యపోతారు. దూరపు బంధువులు నోరెళ్ళబెడుతారు. ఊరివాళ్ళు చాలా మంది తనను అక్కున జేర్చుకుంటారు. ఆప్యాయంగా కౌగలించుకుంటారు. కడుపు నిండా మాట్లాడుతారు. కొసరి కొసరి తినిపిస్తారు. తన రాకకు ఎంతో మంది సంతోషిస్తారు.

బస్సు ఊరి పొలిమేరల్లోకి ప్రవేశించింది. ఆ గాలి రామానుజాని కెంతో హాయి నిస్తోంది. ఊరు దగ్గరవుతున్న కొద్దీ అతని మనస్సు సంతోష సాగరంలో తేలిపోతుంది. కిటికీ లోంచి బయటకు చూస్తూ తాను పుట్టి పెరిగిన ఊరి మట్టి వాసన హాయి నిస్తుంటే ఆనందంతో తబ్బిబ్బవుతున్నాడు రామానుజం.

'అదుగో, ఆ చెరువులోనే ఈత గొట్టాను. ఇవతల గట్టు నుండి అవతల గట్టుకు ఈదుతూ వెళ్ళాను. నీళ్లలో స్నేహితులతో కోడి పుంజులాట ఆడాను. అదుగదుగో, ఆ గుట్ట లెన్నోసార్లు ఎక్కాను. సీతాఫలాలు తెంపుకొని తిన్నాను. తంగేడు పువ్వులు తెంపుకొచ్చాను. అదుగదు గదుగో, అదే మా బడి. ఆ బళ్లోనే పదవ తరగతి వరకు చదివాను.' తనకు జన్మ నిచ్చిన నేల, బాల్యంలో తిరిగిన ప్రదేశాలు కనబడుతుంటే తనలో తాను అనుకుంటూ ఆనందిస్తున్నాడు.

ఊరు సమీపిస్తున్న కొద్దీ అతనిలో భావావేశం పెల్లుబుకుతోంది. ఆనందం కట్టలు తెంచుకొస్తోంది.

ఊరు చివర బస్సాగింది. రామానుజంతోపాటు ఇద్దరు యువకులు బస్సు దిగారు. నడి వయసులో ఉన్న రామానుజాన్ని వాళ్ళు గుర్తించలేదు. సూటుకేసు చేతిలో పట్టుకొని చుట్టూ చూశాడు. అక్కడున్న వాళ్లెవరూ అతన్ని గుర్తుపట్టలేదు.

బస్టాండు దగ్గర చిన్న హోటలు, హోటలు తడికలకు వివిధ భంగిమల్లో సినిమా పోస్టర్లు, సెక్సు బొమ్మ లుండటం గమనించాడు రామానుజం. అక్కడున్న ఖాళీ స్థలంలో మూడు పార్టీల జెండా లుండటం చూసిన రామానుజం భ్రుకుటి ముడిపడింది.

కొద్ది క్షణాలు నిల్చొని తన నెవరూ గుర్తించకపోయేసరికి నిరాశ చెందిన రామానుజం సూట్‌కేసు చేతిలో పట్టుకొని ఊళ్ళోకి నడవ సాగాడు.

తోవ వెంబడి పోతున్న రామానుజం వాకిట్లో కూచోనున్న ఒకతను "అట్లా పోయేది వెంకటయ్య కొడుకు కదా...!" అనడం విని ఆగిపోయాడు. తన నాప్యాయంగా పలుకరిస్తా డనుకున్నాడు.

కాని, అక్కడే ఉన్న మరొకతను వెంటనే "అఁ... ఎవ్వరైతే మనకేంది...?" అనగానే గబగబా నడవసాగాడు రామానుజం.

కొంత దూరం పోయేసరికి ఇద్దరు నడి వయసు వాళ్లెదురయ్యా రతనికి. వాళ్ళు

తనను పలుకరిస్తా డనుకున్నాడు కాని, వాళ్ళేం మాట్లాడకుండానే వెళ్ళిపోయారు. గోడలపై రాసున్న వివిధ పార్టీల, మతాల స్లోగన్లు చూసిన రామానుజం 'ఇక్కడికి అన్నీ దిగుమతయ్యా యన్నమాట...' అని తనలో తాననుకుంటూ మిత్రుడింటి దిక్కు నడుస్తున్నాడు.

ఓ వృద్ధుడెదురై రామానుజాన్ని ఆపి పరీక్షగా చూశాడు. "నీవు వెంకటయ్య కొడుకువు గదా!" అన్నాడు.

ఆ పలుకరింపు కెంతో పొంగిపోయాడు రామానుజం. "అవును... నేను రామానుజాన్ని తాతా...?" అన్నాడు.

"నువ్వు పట్నంలో ఉంటున్నావట కదా?"

"...అవును."

"పట్నంలో పెద్ద బంగ్లే కట్టినవట. బాగానే సంపాదిస్తున్నవట. నీ కేంది మా రాజవు. ఎవరూ లేకున్నా తెలివితోటి పైకచ్చినవు...మంచత్తగారు దొరికింద్రు...సంపాయించు...సంపాయించు... బాగ సంపాయించు..." అనుకుంటూ వెళ్ళిపోయాడా వృద్ధుడు.

తానేమనకున్నా నిష్ఠురంగా మాట్లాడుతూ పోయిన వృద్ధుడి మాటలు రామా నుజానికి బాధ కలిగించాయి. తన కుటుంబం గురించి, పిల్లల గురించి కాక సంపాదన గురించే మాట్లాడి, డబ్బుతోనే తనకు విలువ కట్టడం అతనికి నచ్చలేదు. తను బస్సు దిగగానే ఊరివాళ్లు అప్యాయంగా పలుకరిస్తారని, ఆత్మీయతతో కౌగలించుకుంటారని ఊహించిన రామానుజానికి ఆశాభంగమే అయింది. ఇన్నేళ్ళుగా ఊళ్ళోకి రాని తనను గుర్తుపట్టి ఉండరని తనకు తానే సమాధానం చెప్పుకొని మిత్రుడింటికి చేరుకున్నాడు.

సూటుకేసుతో తనింటికొస్తున్న రామానుజానికి ఎదురు వెళ్లి "హలో!" అన్నాడు లక్ష్మయ్య.

తనను అనురాగంతో కౌగిట్లోకి చేర్చుకుంటాడని ఊహించిన రామానుజం, లక్ష్మయ్య 'హలో' అన్న పొడి మాటలు విని లోలోపలే బాధగా మూలిగాడు. "హలో" అన్నాడు ప్రతిగా.

మిత్రుని చేతిలోంచి సూట్‌కేసు తీసుకొని లోపలి కెళ్లాడు లక్ష్మయ్య. రామానుజంకో కుర్చీ చూపించి, తానో కుర్చీలో కూర్చున్నాడు లక్ష్మయ్య.

ఇంట్లో ఉన్న డైనింగ్ టేబుల్, కుర్చీలు, అధునాతన ఫర్నీచర్‌ను చూస్తూ కూర్చున్నాడు రామానుజం.

"ఎక్కన్నుంచి రావడం?" అడిగాడు లక్ష్మయ్య.

చెప్పాడు రామానుజం.

"ప్రయాణం బాగా జరిగిందా?"

తలూపాడు రామానుజం.

"ఎన్నేండ్ల కెన్నేండ్లకు రావడం - ఇప్పుడు తీరిందన్నమాట, ఈ పల్లెటూరుకు రావడానికి?"

"ఎన్నోసార్లు రావాలనుకుంటూనే రాలేకపోయాను."

"అయినా నీలాంటి వాళ్లకు పల్లెటూరి గాలెలా పడుతుంది? పట్నంలో అలవాటయిన ప్రాణం కదా!"

స్నేహితుడి మాటలకు నొచ్చుకున్నాడు రామానుజం. స్నానం చేసి బట్టలు మార్చుకున్నాడు. స్నేహితుడితో కలసి భోజనం చేశాడు. మంచంలో ఒరిగాడు. ప్రయాణం బడలికవల్ల త్వరలోనే నిద్ర పట్టింది. ఆ రోజెక్కడికీ వెళ్లలేదు.

తెల్లవారి మిత్రునితో కలసి ఊళ్ళోకెళ్ళాడు. పాత మిత్రులను కలుసుకున్నాడు. వృద్ధులతో మాట్లాడాడు. ఊళ్లోని చాలా మందిని కలుసుకున్నాడు. మరో రెండు రోజు లా ఊళ్లోనే ఉన్నాడు. ఊరి వెలుపల కొంటరిగా వెళ్లాడు. మొక్కజొన్న తోటల్లో కెళ్లాడు. చెరువుగట్ల వెంట తిరిగాడు. తాను చిన్నప్పు డాడుకున్న ప్రదేశాల్లో తిరిగాడు. వాతావరణ కాలుష్యానికి గురికాని చల్లని గాలిని పీల్చుకున్నాడు. ధ్వని కాలుష్యం లేని ప్రశాంతతను చవి చూశాడు రామానుజం.

కాని ఆ నాలుగు రోజుల్లో అతడెన్నో విషయాలను తెలుసుకున్నాడు. పల్లెటూళ్ళేవో కోల్పోతున్నట్లు గ్రహించాడు. మునుపటి ఆప్యాయత లోపించినట్లు గమనించాడు. చాలా మంది తనను మంచి చెడ్డల గురించి కాక సంపాదన గురించి అడగటం అతని కదోలా ఉంది. ఏ పెరట్లో కెళ్లినా తంపులు పెట్టి మొక్కజొన్న కంకులు కాల్చేవారు. అతన్నెవరూ పచ్చి కంకులు తినమనక పోవడం గమనించాడు. పాడి ఉన్న వాళ్లింట్లోనూ పెరుగుకు బదులు చల్ల వాడటం చూశాడు. కొసరి కొసరి కడుపు నిండా తినందే వదలనివాళ్ళు మొక్కుబడిగా భోజనం పెట్టడం గమనించాడు. తోటల్లో పూలచెట్లకు బదులు పొగాకు లాంటి వాణిజ్య పంట లేయడం చూశాడు. ఎంతో అన్యోన్యంగా ఉన్న అన్నదమ్ములు డబ్బు కోసం జుట్లు పట్టుకోవడం పరికించాడు. తల్లితండ్రుల నెంతో ప్రేమగా చూసుకునే వాళ్ళు కూడా వృద్ధాప్యంలో వాళ్ళను పోషించడానికి నలుగుర్లో పడి పంచాయతీలు చేసుకోవడం గమనించాడు. రచ్చబండ దగ్గర పంచాయతీలో అన్నదమ్ములు తల్లి నొకరు, తండ్రి నొకరు పంచుకోవడం చూసిన రామానుజానికి బాధ కలిగింది.

మరునాడు తెల్లవారి ఊరి కెళతా డనగా ముందు రాత్రి మిత్రుడు దగ్గర కూర్చున్నాడు రామానుజం. తానూహించిన పల్లెటూళ్లకూ, చూస్తున్న పల్లెకూ గల అంతరాన్ని గురించి ప్రశ్నించాడు. తాను ఇరవై ఏళ్ళ క్రితం చూసిన గ్రామానికి, ఇప్పటి గ్రామానికి గల వ్యత్యాసాన్ని గురించి స్నేహితుణ్ణి అడిగాడు. పాడి పంటలు, గ్రామీణ జీవితంలో వచ్చిన మార్పులు గురించి అడిగాడు.

రామానుజం మాటలు చిన్న పిల్లాడి మాటల్లా తోచాయి లక్ష్మయ్యకు. "అవును – ఇప్పుడు పాడి ఉన్న ఇంట్లోనూ పెరుగు వాడకం తక్కువే! ఎందుకంటే ఆ పాలను టౌనుకెళ్లి అమ్ముకుంటే లీటరుకు ఆరు రూపాయలు. పాలేర్లతో పాలు పిండించి టౌనుకు పంపిస్తారు. చాలా మందికి హోటళ్లలో, ఇండ్లలో ఖాతాలున్నాయి" అన్నాడు లక్ష్మయ్య.

ఎవరూ తనను మాట వరుసకైనా పచ్చి కంకులు తినుమనక పోవడాన్ని గురించి అడిగాడు రామానుజం.

"టౌనుకు తీసుకెళ్ళి కాల్చి అమ్మితే ఒక్కో కంకికి అర్ధ రూపాయి, ముప్పావలా వస్తాయి. పచ్చి వమ్మినా అర్ధ రూపా యొస్తుంది. కూరగాయలు, పాలు, మొక్కజొన్న కంకులు, పచ్చి పల్లికాయ, చివరకు శనగకాయ కూడా టౌనుకు తీసుకెళ్ళి అమ్ముకోవడం నేర్చుకున్నారు మన ఊరివాళ్ళు. అన్నిటినీ క్యాష్ చేసుకోవడం, లౌక్యంగా మాట్లాడటం నేర్చుకుంటున్నా రిక్కడ జనాలు" అన్నాడు లక్ష్మయ్య. "అంతే కాదు బ్రదర్... ఊళ్లో వడ్డీకి షావుకార్లు డబ్బివ్వడం మొదట్నుంచే ఉన్నా – ఒకరి అవసరాల్లో ఒకరు సాయం చేసుకునే వాళ్ళు, కాగితం లేకుండా ఏ అర్ధరాత్రైనా డబ్బిచ్చేవాళ్లు. అందరిలా చేస్తారనను కాని, ఇప్పుడు స్నేహితుడు డబ్బడిగినా లాభనష్టాల బేరీజు వేస్తున్నారు జనం."

తానూహించిన దానికీ, చూస్తున్నదానికీ గల అంతరం మింగుడు పడటంలేదు రామానుజానికి. ఆ రాత్రంతా తనలో తానే ఘర్షణ పడ్డాడు. వచ్చిన మార్పుల గురించి ఆలోచించాడు... అర్ధరాత్రి దాటే వరకూ అతనికి నిద్ర పట్టలేదు.

"దొంగో డొచ్చిండు...దొంగో డొచ్చిండు." అని నాలుగైదు సార్లు కలవరించాడు రామానుజం.

మిత్రుణ్ణి తట్టి లేపాడు లక్ష్మయ్య.

"దొంగెవరు? పీడ కలొచ్చిందా...?"

"ఆఁ... పీడ కలొచ్చింది..." అని పడుకున్నాడు రామానుజం.

కొద్దిసేపటి తర్వాత మళ్లీ "దొంగోడొచ్చిండు దొంగోడొచ్చిండు" అని లేచి కూర్చున్నాడు.

మిత్రుని ప్రవర్తన వింతగా అనిపించింది లక్ష్మయ్యకు. "ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ పడుకున్నట్టున్నావు. హాయిగా నిద్రపో..."

రెండు మూడు సార్లు అలాగే చేశాడు రామానుజం. తెల్లవారి మిత్రునితో కలసి బస్టాండు కెళ్ళాడు రామానుజం. అతని కా ఊరి కొచ్చేటప్పుడున్న ఉత్సాహం ఇప్పుడు లేదు. నాలుగు రోజుల క్రితమున్న ఆనందం, కళా అతని ముఖంలో లేవు. చిన్నబోయినట్టున్న మిత్రుణ్ణి చూస్తూ "ఎట్లనో ఉన్నవేంటి?" అన్నాడు లక్ష్మయ్య.

"లేదు, బాగానే ఉన్నాను" అన్నాడు రామానుజం.

"దొంగోడు...దొంగోడని కలవరించావు. ఎవరా దొంగ?"

"ఊళ్ళోకి దొంగోడొచ్చాడు. ఆప్యాయతలను, అనురాగాలను ఎత్తుకుపోయాడు. మనుషుల మధ్య దూరాన్ని పెంచుతున్నాడు. ఆ దొంగోడెవరో తెలుసా? రూపాయి... రూపాయి..." భావావేశంతో అని కనుకొలకుల్లో కొచ్చిన కన్నీటిచుక్కను దస్తీకద్ది, అప్పుడే వచ్చి ఆగిన బస్సులోకి గబగబా ఎక్కి కూర్చొన్నాడు రామానుజం.

మిత్రుడి మాటల కాశ్చర్యపోయి అలాగే నిల్చున్నాడు లక్ష్మయ్య.

బస్సు కదిలింది.

● ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఫిబ్రవరి 12–18, 1992 ●